ప్రభుత్వంపై అసత్యప్రచారాలు సరికాదు


మాట్లాడుతున్న గౌరీ సతీష్

అబిడ్స్ : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందిస్తుంటే కేటీఆర్ జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేయడం సరికాదని ఆ పార్టీ రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్ అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దోచుకున్న డబ్బునంతా త్వరలోనే కక్కిస్తామని, ఇష్టానుసారంగా ప్రజల సొమ్మును దోచుకున్నారని మండిపడ్డారు. ఓటమి తర్వాత పవిత్ర ప్రకటనలు చేయడం బీఆర్ఎస్‌కు తగదని హితవు పలికారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

తలాబ్‌కట్టాలో సమస్యలు పరిష్కరించండి


వ్యర్థాలను తొలగించాలని కోరుతున్న అంజదుల్లాఖాన్

చార్మినార్: తలాబ్‌కట్టాలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని.. రోడ్లకు ఇరువైపుల పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంబీటీ అధికార ప్రతనిధి అంజదుల్లాఖాన్ అన్నారు. అక్రంనగర్, నషేమన్‌నగర్ తదితర బస్తీలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. తలాబ్‌కట్టాలోని బస్తీల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు జలమండలి ఉన్నతాధికారులను కోరారు.

ప్రొఫెసర్ కోదండరామ్‌కు వినతి


ప్రొఫెసర్ కోదండరామ్‌తో కొమురయ్య

నాంపల్లి : భీమ్‌రావు బాడా బాధితులు టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిశారు. భీమ్‌రావుబాడా బస్తీనేత కొమురయ్య నేతృత్వంలో తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో పలువురు బాధితులు ప్రొఫెసర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భీమ్‌రావు బాడాలోనే బాధితులకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రొఫెసర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

పైలాన్‌కు మరమ్మతులు !


పైలాన్ వద్ద కాంగ్రెస్ నేతలు

గోల్కొండ: నానల్‌నగర్ చౌరస్తా వద్ద ఉన్న కాంగ్రెస్ పైలాన్‌కు మరమ్మత్తులు చేయించి కొత్త రూపును ఇస్తామని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ నియోజకవర్గం నాయకులతో కలిసి కాంగ్రెస్ పైలాన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2006లో నగరంలో జరిగిన కాంగ్రెస్ 82వ ప్లీనరీ సందర్భంగా ఈ పైలాన్ ఏర్పాటు చేశామన్నారు. అప్పట్లో ఈ పైలాన్ నగరంలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ఆర్ ఈ పైలాన్ ఏర్పాటును ప్రతిపాదించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పైలాన్ నిర్వహణను పట్టించుకోలేదని ఆరోపించారు. పైలాన్‌తో పాటు పైలాన్ చుట్టూ ఉన్న పచ్చదనం కూడా దెబ్బతిన్నదని వాపోయారు.తాము బల్దియా అధికారులతో పాటు తెలంగాణ మంత్రులను కలుస్తామన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్సీ కేటాయించాలని వినతి


దీపాదాస్ మున్షికి సమస్యలను వివరిస్తున్న అన్సారీ

నాంపల్లి : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు ఒక ఎమ్మెల్సీ స్థానంతో పాటు పలు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశాలు కల్పించాలని మైనార్టీ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ కోరారు. ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షిని కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. నామినేటెడ్ పోస్టుల్లో మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తామని, ఈనెల 16న ముస్లిం నేతలతో సమావేశమవుతానని, సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మైనార్టీలు హాజరు కావాలని కోరామన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ సుడిగాలి పర్యటన


కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

నాంపల్లి : జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ నాంపల్లి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. బుధవారం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌తో కలిసి పలు డివిజన్‌లలో పర్యటిస్తూ.. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురికి నీటినాలాలు, పొంగుతున్న మ్యాన్‌హోల్స్, చేపట్టాల్సిన కొత్త పనులపై ఆయన సమీక్షించారు. మల్లేపల్లిలోని ఆగాపుర నాలా, జాఫర్‌షా గ్రౌండ్ నాలా, మహబూబ్ ఆసుపత్రి ఎదుట పొంగుతున్న మ్యాన్‌హోల్స్, భోజగుట్ట మురికివాడ అభివృద్ధితో పాటుగా ఆసీఫ్‌నగర్, అహ్మద్‌నగర్ డివిజన్‌లలోని మురికినీటి నాలాలను పరిశీలించారు. అనంతరం స్థానిక సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే, ఈఈ లాల్‌సింగ్ పలువురు ఎంఐఎం నేతలు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలని వినతి



చాంద్రాయణగుట్ట: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దీపాదాస్ మున్షీకి టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు గాంధీభవన్‌లో కలిసి పూలబొకే అందజేశారు. పార్టీలో తాను 38 ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి ఏదైనా కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని ఆమెకు విన్నవించుకున్నారు.

పర్యాటకులకు తిప్పలు

- గోల్కొండలో కనీస సౌకర్యాలు కరువు
- బుకింగ్ కౌంటర్ వద్ద బారులు


గోల్కొండ కోట

గోల్కొండ: ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటకు వేలాదిగా పర్యాటకులు వస్తుంటారు. విదేశీ పర్యాటకులు సైతం భారీ సంఖ్యలో వస్తుంటారు. సెలవులతో పాటు వారంతపు రోజుల్లో పాఠశాలల విద్యార్థులు, ఎన్నో కుటుంబాలు కోటను సందర్శిస్తాయి. గోల్కొండకు వచ్చే పర్యాటకులు ఇక్కడ సౌకర్యాల లేమితో నిరుత్సాహంగా తిరిగి వెళ్తున్నారు. పర్యాటకుల్లో ఎక్కువ శాతం వివిధ రకాల వాహనాల్లో వస్తుంటారు. వారికి సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వారంతపు సెలవు రోజుల్లో..

- వేలాది కార్లు, టూరిజం బస్సులు, ద్విచక్ర వాహనాల రద్దీ సెలవు రోజుల్లో అధికంగా ఉంటుంది. కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ పర్యాటకులకు ఇప్పటి వరకు పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించలేదనే విమర్శలున్నాయి. ప్రైవేటు పార్కింగ్ భారీ సంఖ్యలో వచ్చే వాహనాలకు సరిపోవడం లేదు.


కోట చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్

- పర్యాటకులు తమ వాహనాలను లంగర్‌హౌజ్ నుంచి రాందేవ్‌గూడ, రాందేవ్‌గూడ చౌరస్తా నుంచి గోల్కొండకు వచ్చే రోడ్డు పక్కన పార్కు చేయాల్సి పరిస్థితి ఏర్పడుతోంది. దాదాపు 2-3 కిలోమీటర్లు నడుచుకుంటూ కోటకు వెళ్తున్నారు. కోట ప్రధాన ద్వారానికి ఆనుకుని ఉన్న కోట ప్రహరీ పొడవునా బల్దియా ఫ్రీ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇది ఏమాత్రం సరిపోవడం లేదు.
- భారీసంఖ్యలో పర్యాటకులు వచ్చిన సమయంలో కోట అధికారులు అదనపు బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేయడం లేదని పలువురు వాపోతున్నారు. దీంతో బుకింగ్ కౌంటర్ల వద్ద పర్యాటకులు బారులు తీరుతున్నారు.

క్యాంటిన్ లేక అవస్థలు..

కోటకు వచ్చే పర్యాటకులు కోట మొత్తం కలియ తిరిగేందుకు కనీసం 3-4 గంటల సమయం పడుతుంది. ఇక్కడి క్యాంటిన్‌లో కేవలం ఐస్‌క్రీమ్‌లు మాత్రమే లభిస్తున్నాయి. దీంతో పర్యాటకులు భోజనం లేదా టిఫిన్లు లేకపోవడంతో పెదవివిరుస్తున్నారు. మరోవైపు కోట లోపలికి వాటర్ బాటిల్స్, భోజన పదార్థాలు తీసుకెళ్లే సౌకర్యం లేకపోవడంతో పర్యాటకులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

ట్రాఫికర్...

- వారపు సెలవులు, సంక్రాంతి, వేసవి సెలవుల్లో గోల్కొండ కోట మెయిన్ గేట్ ముందు ఉన్న చౌరస్తా పర్యాటకులతో పాటు ఇతర వాహనాలు, స్థానికుల రాకపోకలతో రద్దీగా మారుతోంది. పర్యాటకుల వాహనాలు, ఆర్టీసీ బస్సులు తరచూ ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుకుపోతున్నాయి. కోట మెయిన్‌గేట్ ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్‌లను తోపుడు బండ్లవారు కబ్జా చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో పాదాచారులు గత్యంతరం లేక బిక్కుబికుమంటూ నడుస్తున్నారు.
- మరోవైపు కోట ఎదురుగా ఉన్న షాపుల ఎదుట కార్లు, ద్విచక్ర వాహనాలు అక్రమంగా రోడ్లపై పార్కు చేసి ఉంటున్నాయి. దీంతో కోటకు దూరంగా తమ వాహనాలు పార్కు చేసి కోటకు వచ్చే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రకు ట్రాఫిక్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు కోట గేటుకు ఉన్న ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లను తొలగించడంలో సైతం కోట అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి. ఎంతో ఉత్సాహంగా కోటను చూద్దామని వచ్చే పర్యాటకులు చేదు జ్ఞాపకాలు మూటకట్టుకొని వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని పలువురి అభిప్రాయం.

కారు అద్దాలు పగులగొట్టి దాడి

విజయనగర్‌కాలనీ : అకారణంగా ఓ వ్యక్తిని కొట్టి గాయపరిచి కారు అద్దాలు పగలగొట్టిన ఘటన హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సులేమాన్‌నగర్‌లో నివసించే మీర్ ముర్తుజాఅలీ (50) ఈనెల 9న కుటుంబసభ్యులతో కలిసి తన కోడలు జన్మదిన వేడుకలను మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. అనంతరం కారు నెంబరు(టీఎస్07 టీజీ7729)లో అర్ధరాత్రి 12 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. షేక్‌పేట ఫ్లైఓవర్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన కారు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ.. ఓవర్‌టేక్ చేశారు. అంతేకాకుండా పదే పదే హారన్ మోగిస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. రేతిబౌలి పిల్లర్ నెంబర్ 31 వద్దకు రాగానే 1818 కారులో వస్తున్న నజీబుద్దీన్ అతడి మిత్రులు బాధితుడి కారు అద్దాలను రాయితో పగులగొట్టి సులేమాన్ ముర్తుజాఅలీని గాయపరచడంతో పాటు మహిళలను దుర్భాషలాడారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇరు వర్గాలు ఒకే రాజకీయ పార్టీకి చెందినవి కావడం గమనార్హం.

మహిళ అదృశ్యం


స్రవంతి (ఫైల్)

అబిడ్స్: మంగళ్‌హాట్ జిన్సిచౌరాహిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుబ్రమణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. జిన్సిచౌరాహిలో నివసించే స్రవంతి ఈనెల 8న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకి కోసం బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతొట భర్త సోనుసింగ్ మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్ : 11కే.వీ రంగ్‌మహల్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఉస్మానియా మెడికల్ కాలేజ్, ఎస్‌బీఐ బ్యాంక్, గుల్‌బాగ్, ప్రగతి టిఫిన్ సెంటర్, అల్లా ఉద్దీన్ ఐటీఐ కాలేజ్, ఆదిత్య ఆసుపత్రి, బొగ్గులకుంట తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుండి 11.30 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11 కే.వీ రామకృష్ణ థియేటర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ట్రూప్ బజార్, సిద్దార్థ హోటల్, జీపీఓ, రామకృష్ణ థియేటర్, సోహైల్ హోటల్, సాగర్ హోమియోథెరపీ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 11కే.వీ సీబీఐ విద్యుత్ ఫీడర్ పరిధిలోని అప్పాబజార్, సమోస గల్లి, 94 బస్టాప్, ఆర్ఎస్ బ్రదర్స్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరా ఉండదని తెలిపారు.

క్రీడలతోనే ఉద్యోగులకు మానసిక ఉల్లాసం


విజేతలను అభినందించిన డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేని

అబిడ్స్ : ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని అన్నారు. తమ విధుల్లో ఎల్లప్పుడు బిజీగా ఉండే ఉద్యోగులు, ఉల్లాసం, ఉత్సాహంతో ఉండేందుకు టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో తరచూ.. క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 9వ యెట్టం సదానంద్ క్రికెట్ టోర్నమెంట్ మొదటి క్వార్టర్ ఫైనల్స్ ఆటా పోటీలు జింఖానాలో నిర్వహించారు. గాంధీ ఆసుపత్రిపై విజయం సాధించిన హైదరాబాద్ జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులు, వాటర్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్‌పై హైదరాబాద్ యూత్‌ఫోర్స్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఏటా హైదరాబాద్ టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో పలు శాఖల ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించి వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీస్తున్నట్లు వివరించారు. ఉద్యోగుల సంక్షేమం, ప్రగతి కోసం తమ యూనియన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. విక్రమ్‌కుమార్, వైదిక్‌శాస్త్రి, శ్రీధర్ నాయకుడు ముఖిం ఖురేషి, మహ్మద్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయానికి శ్రీరాముడి వెండిపాదుకలు

చాంద్రాయణగుట్ట: చారిత్రాత్మకమైన లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి దేవాలయానికి అయోధ్యలో శ్రీరాముడికి సమర్పించబోయే 'వెండి పాదుకలు' తీసుకొచ్చి అమ్మవారి వద్ద పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శృంగేరి పీఠం నుంచి ఆలయానికి తీసుకొచ్చిన ఈ పాదుకలకు ఆలయ కమిటీ తరఫున ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అర్చకులు శాస్త్రోక్తంగా పురుషసూక్త విధానంతో పాదుకలకు పూజలు జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్‌యాదవ్, మాజీ చైర్మన్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి మారుతీయాదవ్, ప్రచార కార్యదర్శి వినోద్‌కుమార్, కె.విష్ణుగౌడ్, రాజుకుమార్‌యాదవ్, గడ్డం రవి తదితరులున్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సంతోష్‌నగర్: ప్రముఖ బీపీడీఏవీ పాఠశాల విద్యార్థులు పూజిత, రషిత, హాసిని, నిషిత, సంజనతో పాటు సహస్ర ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు సిద్దిపేట్‌లో జరిగే తెలంగాణ స్టేట్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్‌కు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ వీ.ఎస్.ప్రశాంత్ ప్రకటించారు. విద్యార్థుల్లో పోటీతత్వం, గెలుపోటములు సమానంగా స్వీకరించే స్వభావం, నాయకత్వ లక్షణాలను వెలికితీసేందుకు వివిధ క్రీడాపోటీలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. పాఠశా ల చైర్మన్ గౌరీశంకర్‌రావు, డీఏవీ పాఠశాల ఏఆర్‌ఓ వసంత, ఎస్.రామన్, పాఠశాల ప్రిన్సిపాల్ వీ.ఎస్.ప్రశాంత్, ఎల్ఎంసీ సభ్యులు విద్యార్థులను అభినందించారు.

రాకేష్ తివారికి మాతృ వియోగం

నేడు పురానాపూల్‌లో అంత్యక్రియలు..



చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి మాజీ చైర్మన్, సుల్తాన్‌షాహీ జగదాంబ దేవాలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి తల్లి దమయంతి తివారీ అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం సాయంత్రం స్వగృహంలో మరణించిన ఆమెకు ఓ కుమారుడు, ఆరుగురు కుమార్తెలు సంతానం. కాగా అంత్యక్రియలు గురువారం ఉదయం పురానాపూల్‌లోని హిందూ శ్మశానవాటికలో జరుగనున్నాయి. సమాచారం తెలిసిన వెంటనే పలువురు అధికార, అనధికార ప్రముఖులు సుల్తాన్‌షాహీలోని ఇంటికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. మహంకాళేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య పార్థీవదేహానికి నివాళులర్పించి రాకేష్ తివారీ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ఇంటింటా అయోధ్య సంబురం


అక్షతలను పంపిణీ చేస్తున్న రఘు, జీవన్, మయూర్ తదితరులు

అబిడ్స్: ఈనెల 22న అయోధ్య సంబరాలు ఇంటింటా చేపడతామని గోషామహల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు రఘు, జీవన్, మయూర్‌లు పేర్కొన్నారు. గోషామహల్ పరిధిలోని గోషామహల్, హిందీనగర్ ప్రాంతాల్లో ఇంటింటా అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 22వ తేదీ ప్రతి ఇంటా దీపావళి సంబరాలు జరగాలన్నారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభించినరోజే ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించి దీపావళి శోభా కలిగేలా అందరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, కాజల్, సన్ని, జున్ను తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండలో..

గోల్కొండ: 22వ తేదీ ప్రజలందరికీ పర్వదినమని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. బుధవారం ఆయన గోల్కొండలోని రిసాలబాజర్, బంజిరి దర్వాజ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి అయోధ్య శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ చంద్రుడు మానవాళికే ఆదర్శ పురుషుడని, ప్రతి ఒక్కరికీ ఆయన పూజ్యనీయుడని పేర్కొన్నారు. మహంకాళి అమ్మవారి పూజారి సురేష్‌చారి తదితరులున్నారు.

యూపీ తరహాలో సెలవు ప్రకటించాలి..

చార్మినార్: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం ఆరోజు విద్యార్థులకు సెలవు ఇచ్చినట్లే తెలంగాణలో కూడా సెలవు ఇస్తే బావుంటుందని అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పంకజ్‌కుమార్ అగర్వాల్ కోరారు. అయోధ్య రామ మందిర తీర్థ ట్రస్ట్ నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షతలను పటేల్ మార్కెట్, ఉర్దుగల్లి, బంగార్‌చౌక్ తదితర ప్రాంతాలలోని రామ భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అందరూ తమ తమ ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపావళి పండుగ లాగా దీపాలంకరణ చేయాలన్నారు. ప్రతినిధులు పవన్ మిశ్రా, లక్ష్మీకాంత్ ఫాండే, సంజయ్‌దీక్షిత్, అశోక్ సింగానియా తదితరులున్నారు.

అక్షతల పంపిణీ

గన్‌ఫౌండ్రీ : గాంధీభవన్ భూలక్ష్మమ్మ దేవాలయం పరిసర ప్రాంతాల్లో బుధవారం అయోధ్య రామ మందిర అక్షింతలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జగపతి అరుణ్, బసంత్, శేఖర్, అంజమ్మ, నర్సింగ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలి


బల్దియా కమిషనర్‌తో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన బల్దియా కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను కలిశారు. నియోజకవర్గంలోని గోల్కొండ, కార్వాన్, నానల్‌నగర్ డివిజన్‌లలో పనులు ప్రారంభమై మధ్యలోనే ఆగిపోయాయన్నారు. కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో పాటు ఎన్నికల కోడ్ వల్ల కూడా కొన్ని పనులు ఆగిపోయాయని వాటిని యుద్ధప్రాతిపదికన వెంటనే పూర్తి చేయాలని కోరారు. గతంలో తాను సమర్పించిన ప్రతిపాదనలను మంజూరు చేసి వాటికి వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్ పనులపై ప్రజలు తనను నిలదీస్తున్నారని, ప్రజలకు జవాబు ఇవ్వలేక తాను ఇబ్బందులు పడుతున్నానన్నారు. టోలిచౌకీ, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు సకాలంలో పనిపూర్తి చేయలేకపోతున్నారని చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కమిషనర్‌ను కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మత్తులు...

కార్వాన్ నియోజకవర్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మత్తులు చేసి తాను సూచించిన ప్రదేశాలలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. బుధవారం ఆయన టీఎస్ఎస్‌పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కార్వాన్, లంగర్‌హౌజ్, నానల్‌నగర్ డివిజన్‌లలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మత్తులు లేక ప్రమాదకరంగా మారాయన్నారు. పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచేలేదని.. దీన్ని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రేతిబౌలి నుంచి హకీంపేట కాళా బంగ్లా వరకు మిలట్రీ ఏరియా నుంచి ఉన్న విద్యుత్‌లైన్లను మళ్లించి రేతిబౌలి మీదుగా వేయాలని కోరారు. బేగంబజార్ విద్యుత్ డీఈ పరిధిలో 10 కిలోమీటర్ల బంచ్ కేబుల్ అందించాలన్నారు. టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్ ఉన్నారు.

గోపి సత్యప్రకాష్‌కు భజరప్ప రంగస్థల పురస్కారం



నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్‌టీఆర్ కళామందిరంలో సిరిమువ్వ కల్చరల్స్ నాటకోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం జరిగిన నాటకోత్సవంలో భాగంగా ఉదయ్‌భాను రచన, దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సాహితీ సూక్తం నాటిక, అడారి సోమశేఖర్ రచించిన మంజునాథ దర్శకత్వంలో హక్కు నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా భజరప్ప రంగస్థల పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల రచయిత గోపి సత్యప్రకాష్ (స్నిగ్ధ)కు అందజేసి సత్కరించారు. రంగస్థల అధ్యాపకులు ఆచార్య డీఎస్ఎన్.మూర్తి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా రచయిత కే.వీ.బలరామమూర్తి హాజరయ్యారు. రంగస్థల నటులు డాక్టర్ రాయల హరిశ్చంద్ర, రంగస్థల సమన్వయకర్త రామకోటేశ్వరరావు, పెరుమాళ్ల, కళా విపంచి బొప్పన నరసింహారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీల అమలుకు కృషి


స్థానికులతో సమావేశమైన కాంగ్రెస్ నేత రవిరాజ్

గౌలిపురా: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సంక్షేమాలు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు రవిరాజ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు యాకుత్‌పురా నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నాయకులతో రవిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోనివారు జీహెచ్ఎంసీ, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను అందజేయాలన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ సెక్రటరీ అల్లం భాస్కర్, టీపీసీసీ సెక్రటరీ కోట్ల శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు రాజుయాదవ్, ఏ-బ్లాక్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాస్, జిలావర్, సీనియర్ నాయకులు గోవర్ధన్, గ్రేటర్ హైదరాబాద్ సెక్రటరీ శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు కొండ నళినిగౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు కోట్ల లడ్డూ, శశియాదవ్, డివిజన్ అధ్యక్షుడు అల్లం రాకేష్, మల్లికార్జున్, రాహుల్, ఖాదీర్‌నూర్, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు.. బహుమతుల ప్రదానం


కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కావూరి వెంకటేష్, వినోద్ చౌగ్లే

గోల్కొండ: సంక్రాంతి పండుగ అంటే మహిళలకు ఎంతో ఇష్టమని హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాతి అన్నారు. బుధవారం కార్వాన్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముగ్గులు వేయడానికి వయసుతో సంబంధం లేకుండా మహిళలు ఎంతో ఉత్సాహంగా ముందుకొస్తారన్నారు. తెలుగు తనం ఉట్టిపడే సంక్రాంతికి ఎన్నో విశిష్టలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల విజేతలకు పట్టుచీర, వెండి కుంకుమభరణి తదితర వస్తువులను అందజేశారు. హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు ముత్యాల దుర్గారాణి, ప్రధాన కార్యదర్శి లక్ష్మి, వరలక్ష్మి, మాధవి, అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రమేష్, ఎన్.రాజు, రంగాచారి, సంపత్ తదితరులున్నారు.

జియాగూడ: సంక్రాంతి సంబరాల్లో రంగోళి పోటీల్లో మహిళలు, యువతులు ముగ్గులు వేసి ఎన్నో సందేశాలను తెలియజేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కావూరి వెంకటేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం జియాగూడ డివిజన్ 2బీహెచ్‌కే అంబేడ్కర్ ప్లే గ్రౌండ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నర్మద ఆధ్వర్యంలో ఏర్పాటైన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. గ్రేటర్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వినోద్‌చౌగ్లే, డివిజన్ అధ్యక్షుడు దర్శన్, ఆనంద్ ముదిరాజ్, మధుసూదన్, నవీన్‌కుమార్, వనిత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం